ప్రజాశక్తి
శుక్రవారం 26 మే 2023



ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్

మండలంలోని దిబ్బగుడ్డివలస ఉపాధి కూలీల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీదేవిని గురువారం అధికారులు సస్పెండ్ చేశారు. గ్రామంలో సంబంధిత అధికారులు విచారణ జరిపి ఆమె అవినీతికి పాల్పడినట్లు గుర్తించడంతో ఉపాధి పీడీ ఉమా పరమేశ్వరి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఈ తరహా అక్రమాలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని పీడీ హెచ్చరించారు.



ప్రణతిశ్రీజ (ఇంజనీరింగ్ 10వ ర్యాంకు)



వి.సంతోషిని (మెడికల్ 20వ ర్యాంకు)

తెలంగాణ ఎంసెట్‌లో

సత్తాచాటిన జిల్లా విద్యార్థులు

ప్రజాశక్తి-గుర్ల, బొబ్బిలి

తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. గుర్ల మండల కేంద్రానికి చెందిన మీసాల ప్రణతి శ్రీజ రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంకు సాధించింది. ప్రణతి శ్రీజ ఇటీవల విడుదలైన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో జనరల్‌లో 78వ ర్యాంకు, ఒబిసిలో 12వ ర్యాంకు సాధించింది. ముంబయి ఐఐటిలో చదవాలన్నది తన కోరికని ఈ సందర్భంగా తెలిపింది. ఇంటర్ విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో చదువుకుంది. తండ్రి అప్పలనాయుడు ఆర్‌పిఎఫ్‌లో విధులు నిర్వహిస్తుండగా, తల్లి అన్నపూర్ణ ఉపాధ్యాయరాలిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా కుమార్తెను తల్లి దండ్రులు, గ్రామస్తులు అభినందించారు. బాడంగి మండలం మల్లంపేటకు చెందిన వి.సంతోషిని మెడికల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 20వ ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి అప్పారావు భోగాపురం జెడ్‌పి హైస్కూలులో ఉపాధ్యాయులుగా పనిచేస్తుండగా, తల్లి భవాని గృహిణి. ఈ సందర్భంగా కుమార్తెను వీరు అభినందించారు. విజయనగరానికి చెందిన ఎల్. లావణ్య 156వ ర్యాంకు, బొబ్బిలికి చెందిన పిఎస్ బాలాజీ అభిషేక్ 215, మజ్జి హోమేష్ బాబు 224, పి.భువన్‌సాయి 267, పార్వతీపురానికి చెందిన వి.యాసవి నాయుడు 269వ ర్యాంకు సాధించారు. విజయనగరానికి చెందిన మౌనిష నాయుడు 271, ఎఎస్ సూర్య సాయి ప్రణవ్ 329, పొట్నూరు సాత్విక 361, సిహెచ్‌వి యశ్వంత్ 509, కొల్లి ప్రభాత్ 609, ఎస్.కోటకు చెందిన వి.హోమ ప్రమోద్ 326, బొబ్బిలికి చెందిన ఎం.అనుశ్రీ 398 ర్యాంకులు సాధించారు. బొబ్బిలికి చెందిన సాయి కీర్తన 596, బియు మహేశ్వరరావు 607 సాధించారు.

కలగా మిగిలిన మినీ రిజర్వాయర్

- పరిశీలనకే పరిమితం
- సాగునీరు ప్రశ్నార్థకం
- బీడు భూములుగా మారుతున్న వైనం
- పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి - వీరఘట్టం

చిన్న నీటి వనరులు... పేరులోనే చిన్న ఉన్నప్పటికీ... వాటిని సద్వినియోగం చేసుకుంటే భారీగా ప్రయోజనాలు పొందొచ్చు. భూ సేకరణ, అటవీ పర్యావరణ అనుమతులతో సంబంధం లేకుండా తక్కువ సమయం అతి తక్కువ వ్యయంతో సులువుగా నిర్మించుకోడానికి వీలున్నవి చిన్న నీటి వనరులే. కానీ వాటిపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతుంది. ఇందుకు ఉదాహరణ ఎండకొండ-ఈతకొండ మినీ రిజర్వాయర్ నిర్మాణమే.

మండలంలోనే కుంబుడి ఇచ్ఛాపురం పంచాయతీ ఎండ కొండ- ఈతకొండ గ్రామాల మధ్య మినీ రిజర్వాయర్ సుమారు రూ.4కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు నాలుగు దశాబ్దాలు కిందట ప్రతిపాదనలు చేశారు. ఏళ్లు గడుస్తున్నా పనులు ప్రారంభించక పోవడంతో సుమారు 2వేల ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ఈ మినీ రిజర్వాయర్ పూర్తయితే అచ్చుపువలస గిరిజన గ్రామం నుంచి సీతంపేట మండలం బర్న వరకు కొండ పక్కన ఉన్న భూములు సస్యశ్యామలమవుతాయి. ఇక్కడ మినీ రిజర్వాయర్ నిర్మించేందుకు అప్పట్లో మట్టి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం విశాఖ ల్యాబ్‌కు పంపించారు. ఏళ్లు గడుస్తున్నా పనులు చేపట్టకపోవడంతో పంట భూములు బీడుగా మారుతున్నాయి.

వర్షాలపైనే ఆధారం

ప్రతి వర్షాలపైనే ఆధారపడి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తున్నప్పటికీ వర్షం పడితేనే పంట చేతికొస్తుంది. లేదంటే పంటలపై పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నట్లు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి తప్పడం లేదని రైతులు గౌరు నాయుడు, ధర్మారావు, ఆనందరావు, చిన్నారావు, సోములు, భాస్కరరావు తదితర వాపోతున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో మోటార్ల సహాయంతో తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ నీటిని ఎగువకు మళ్లించి పంటలు కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వృథాగా పోతున్నసాగునీరు

వృథాగా పోతున్న సాగునీరు

రిజర్వాయర్ పనులు చేపట్టకపోవడంతో సాగునీరు వృథాగా ఒట్టిగెడ్డ కలిసిపోతుంది. మినీ రిజర్వాయర్ పనులు చేపట్టి ఉంటే సాగునీటికి ఇబ్బంది ఉండేది కాదదని, ఏడాదికి రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మినీ రిజర్వాయర్ పనులు చేపట్టేందుకు వీలుగా తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన అన్నదాతలు కోరుతున్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వినియోగించుకోండి

- గర్భస్థ లింగ నిర్ధారణ నేరం
- డిఎంహెచ్ఒ రమణకుమారి

ప్రజాశక్తి-విజయనగరం



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ సేవలను వినియోగించుకోవాలని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్‌వి రమణకుమారి కోరారు. తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఫ్యామిలీ ఫిజీషియన్ సేవల గురించి వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా అక్టోబరు 21 నుంచి ప్రతీ పిహెచ్‌సి వైద్యులు 104 వాహనాల ద్వారా నెలలో రెండుసార్లు గ్రామాలకు వెళ్లి, వారి ఊరిలోనే వైద్యాన్ని అందిస్తున్నారని చెప్పారు. దీనికోసం గ్రామాల్లో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లను కూడా ఏర్పాటు చేశామన్నారు. వైద్యులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సాధారణ పేషెంట్లను చూస్తున్నారని, మధ్యాహ్నం నుంచి బాలింతలు, మంచానికే పరిమితమైన రోగులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్లలోని పిల్లలకు ఆరోగ్య తనిఖీలను నిర్వహిస్తున్నారని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 2.23లక్షల మందికి వైద్యాన్ని అందించారన్నారు. ఉచితంగా మందులను అందించడమే కాకుండా 14 రకాల వ్యాధి నిర్ధారణా పరీక్షలను కూడా అక్కడే చేస్తున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

గర్భస్థ లింగ నిర్ధారణ చేయడం, చేయాలని కోరడం కూడా నేరమని డిఎంఅండ్‌హెచ్ఒ స్పష్టం చేశారు. దీనికి పాల్పడినవారికి పిసిపిఎన్‌డిటి చట్టం ప్రకారం 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.50వేలు నుంచి లక్ష వరకు జరిమానా విధిస్తామని తెలిపారు. ప్రతీ స్కానింగ్ సెంటర్లో, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని తెలిపే ఫ్లెక్సీలను విధిగా ఏర్పాటు చేయాలని చెప్పారు. స్కానింగ్ సెంటర్లు ఇచ్చే బిల్లులు, రిపోర్టులపైనా ఈ విధంగానే ముద్రించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ లేని స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలను తీసుకుంటామని తెలిపారు.



నిరసన దీక్షను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు పి.రామచంద్రరావు

సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందే..

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన నిరసన దీక్ష

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్ దారులకు ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు, పింఛన్ సొమ్ము చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పి.రామచంద్రరావు డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని, 11వ పిఆర్సీలో జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని కోరుతూ గురువారం ఎన్‌జిఒ హోమ్ వద్ద ఒకరోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేస్తామని హామీ ఇచ్చిన సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. సిపిఎస్ రద్దు చేయాలని పోరాటాలు చేస్తే ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్ సకాలంలో ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రౌతు రామమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు వైసిపి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. 12వ పిఆర్‌సిపై ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయకపోతే వైసిపికి బుద్ధి చెపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.


అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్‌కు వినతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆర్‌టిసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పివి.కిరణ్, రాజేష్ డిమాండ్ చేశారు. గురువారం కొండ వెలగాడలో ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మకు వారు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఆర్‌టిసిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించి థర్డ్ పార్టీ విధానం రద్దు చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు.

జిఒ 7 ప్రకారం జీతాలు చెల్లించాలని తదితర అంశాలపై వినతి పత్రం అందజేశారు. గదల బంగారమ్మ మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



జోనల్ చైర్‌పర్సన్ బంగారమ్మకు వినతినిస్తున్న ఆర్‌టిసి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ట్రైనీ సహాయ కలెక్టర్‌గా వెంకట త్రివినాగ్

ప్రజాశక్తి-విజయనగరం



జిల్లాకు శిక్షణ నిమిత్తం కేటాయించిన ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహాదిత్ వెంకట త్రివినాగ్ గురువారం కలెక్టర్ కార్యాలయంలో విధుల్లో చేరారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని తన ఛాంబరులో కలిసిన అనంతరం బాధ్యతలు చేపట్టారు. 2022 సివిల్ సర్వీసెస్ బ్యాచ్‌కు చెందిన ఆయన హైదరాబాద్ ఐఐటిలో మెటలర్జీ బ్రాంచిలో 2020లో బిటెక్ పూర్తి చేశారు. విజయవాడ, విశాఖపట్నం, ముంబై తదితర నగరాల్లో పాఠశాల విద్యను పూర్తిచేసి సిబిఎస్ఇ అఖిల భారత పరీక్షల్లో ఆలిండియా టాపర్‌గా నిలిచారు. వెంకట త్రివినాగ్ తండ్రి బి.జయకుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఆదాయపన్నుల శాఖ చీఫ్ కమిషనర్‌గా చేస్తున్నారు. ఆయన స్వస్థలం విశాఖపట్నం. బాడ్మింటన్, వ్యాయామం అంటే తనకు ఎంతో ఇష్టమని వెంకట త్రివినాగ్ చెప్పారు. శ్రీకాకుళంలో నిర్వహించిన చదరంగం టోర్నమెంట్‌లో గతంలో పాల్గొన్నట్టు వివరించారు. తన తండ్రి నుంచి స్ఫూర్తి పొంది పబ్లిక్ సర్వీస్ రంగంలో పనిచేయాలని భావించానని, అందువల్లే సివిల్ సర్వీసెస్‌ను తన కేరీర్‌గా ఎంచుకున్నానని చెప్పారు.

మానవత్వం చాటుకున్న విజయనగరం యూత్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గత రెండు రోజులుగా అంతిక్రియలకు డబ్బులు లేక విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఉన్న ఒక అనాధ శవానికి అంతిక్రియలు చేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. న్యూ విజయనగరం యూత్ ప్రెసిడెంట్ అంబులెన్స్ శివ,సెక్రెటరీ అనిల్ కుమార్. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో బుధవారం కడప నుంచి మట్టి పని నిమిత్తం సాలూరు వచ్చిన గోపాల్ నాయుడు అనే వ్యక్తి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మరణించాడు. చనిపోయిన వ్యక్తి భార్య డబ్బులు లేక బాధ పడుతుండటం చూసిన న్యూ విజయనగరం యూత్ సభ్యులు మృతదేహానికి అంతిక్రియలు తాము చేస్తామంటూ ముందుకు వచ్చి సొంత డబ్బులతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యూ విజయనగరం యూత్ ఫౌండేషన్ సభ్యులు అరవింద్ సందీప్ , సాయి కష్ణ ,తరుణ్, సాయి, తదితరులు పాల్గొన్నారు,



చిన్నారులకు భాష ప్రాధాన్యతను వివరిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు సుబ్బారావు

భాషపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

వినడం, మాట్లాడడం, రాయడం, చదవడం ద్వారా భాషపై పట్టు సాధించవచ్చునని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పివిఎల్ సుబ్బారావు తెలిపారు. గురువారం స్థానిక గురజాడ స్మారక జిల్లా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఏ భాష అయినా ఈ నాలుగు సూత్రాలు ద్వారా క్షుణ్ణంగా నేర్చుకోవచ్చునని, పట్టు సాధించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పిల్లలతో కథలు చెప్పించారు. అనంతరం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు పండిట్ జిఎస్ చలం మాట్లాడుతూ పుస్తకాన్ని ఏ విధంగా సమీక్షించాలో తెలిపి విద్యార్థులకు సమీక్ష రాయవలసిందిగా కోరారు. శిక్షణలో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి ఎన్.లలిత, ఉప గ్రంథాలయ అధికారులు బి.లక్ష్మి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిత్రలేఖనం జిజ్ఞాస పెంచుతుంది

చిత్ర లేఖనం ప్రతి ఒక్కరిలో జిజ్ఞాస పెంచుతుందని ఎం.మోహన్ రావు అన్నారు. గాజులరేగశాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో పిల్లలకు చిత్రలేఖనం ద్వారా ఏవిధంగా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చు వివరించారు. చిత్రలేఖనంలో పిల్లలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎం లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తోటపాలెంలోని 33/11కెవి సబ్‌స్టేషన్‌లో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనుల నేపథ్యంలో ఈనెల 26, 27తేదీల్లో పలు ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్తుశాఖ ఇఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. బాలాజీనగర్, సెంట్రల్ బ్యాంకు, నాయుడు కాలనీ, బ్యాంకు కాలనీ ఫీడర్ల పరిధిలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఆంధ్రప్రదేశ్‌లోని 162 మోడల్ స్కూళ్లలో 2023-24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిసు_న్నట్లు స్కూల్ ఎడ్యుకేషన్ కమీషనర్ ఎస్.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శ పాఠశాలలలో బోధనా మాధ్యమం ఆంగ్లంలో ఉంటుందని, విద్యను అభ్యసించేందుకు ఎటువంటి ఫీజులు చెల్లించనవసరం లేదని స్పష్టం చేసారు. సంబంధిత జిల్లాల్లో ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలలో 10వ తరగతి లో ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు వివరాల కోసం http:amps.apcfss. in http:// cse.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించా లని తెలిపారు. అభ్యర్థులు ఈనెల 22 నుంచి జూన్ 6 లోపల నెట్ బ్యాంకింగ్/క్రెడిట్/డెబిట్ కార్డు లను ఉపయోగించి గేట్ వే ద్వారా అప్లికేషను రుసుము చెల్లించిన తర్వాత వారికి జనరల్ నెంబర్ కేటాయించ బడుతుందని, ఆనెంబర్ ఆధారంగా పై తెలిపిన వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

దరఖాస్తు రుసుము ఒసి, బిసి, ఇడబ్లుఎస్‌లకు రూ.200 , ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.150 చెల్లించాలని తెలిపారు. ప్రవేశాలు 10 వ తరగతి మార్కుల మెరిట్ ద్వారా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం కేటాయిస్తామని తెలిపారు. వివరాలకు ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలి.

బదిలీల జీవో 47ను సవరించాలి

ఎస్‌టియు డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ బదిలీల జీవో 47ను సవరించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం విజయనగరం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. గురువారం స్థానిక అమర్‌భవన్‌లో ఆ సంఘం సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్ అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.జోగారావు ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో 47 అసంబద్ధంగా ఉందని, ప్రధానంగా విద్యార్థుల నమోదు తేదీ కట్‌ఆఫ్ తేదీ గత ఏడాది ఆగస్టు 31 నాటికి తీసుకోవడం సరికాదని అన్నారు. ఈ విద్యా సంవత్సరం చివరి పని దినం ఏప్రిల్ 30ను చివరి పనిదినంగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతం మాదిరిగా పిఎస్, హెచ్‌ఎం పోస్టులను అదే పాఠశాలలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్ మాట్లాడుతూ బదిలీలు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహిస్తున్నందున ఖాళీలన్నీ బ్లాక్ చేయకుండా కౌన్సిలింగ్‌లో చూపించాలని, మిగిలిన ఖాళీలను డిఎస్‌సి ద్వారా ఎంటిఎస్ ఉపాధ్యాయుల ద్వారా భర్తీ చేయాలని. ప్రిఫరెన్షియల్ కేటగిరికి సంబంధించి జిల్లా కమిటీ ప్రమేయాన్ని తొలగించి జీవో ప్రాతిపదికన మాత్రమే అమలు చేయాలని, హై స్కూల్ ప్లస్ పదోన్నతులను శాశ్వత ప్రాతిపదికను మాత్రమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిలర్ వి గోవిందరావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి మద్యంశెట్టి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కోలగట్ల జన్మదినం సందర్భంగా

28న పలు సామాజిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఈనెల 28న నగరంలో వైసిపి నాయకులు, యువజన విభాగం ఆధ్వర్యంలో పలు సామాజిక సేవాహిత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నగర అధ్యక్షుడు ఆసపు వేణు, ఎంపిపి మామిడి అప్పలనాయుడు వెల్లడించారు. గురువారం కోలగట్ల నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆశపు వేణు మాట్లాడుతూ ఈనెల 28న కోలగట్ల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. 27న రక్తదాన శిబిరాలు, 28 సేవాహిత కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారపు. 27న మొత్తం ఆరు జోన్లుగా విభజించి జోన్లు వారీగా రక్తదాన శిబిరాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. 28న కోలగట్ల నివాసంలో కేకును కట్ చేసిన అనంతరం సేవా కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. 11 గంటలకు ప్రకాష్ సిల్క్ ప్యాలెస్ వద్ద పేదలకు చెప్పులు పంపిణీ, 12 గంటలకు కొత్తపేట నీళ్ళ ట్యాంకు వద్ద ఫుడ్ బ్యాంక్ ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. యాదవసంఘం ఆధ్వర్యంలో మెగా దంత వైద్య శిబిరాన్ని నిర్వహించినున్నట్లు చెప్పారు. సర్వజన ఆస్పత్రి, ఘోషాసుపత్రి, ప్రేమ సమాజం, అంధుల పాఠశాలలో వితరణ కార్యక్రమాలను, పలు దేవాలయాలలో అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు.

మండల పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కాకతీయ కళ్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, జోనల్ ఇన్చార్జిలు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో 30 మందికి ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి- విజయనగరం కోట

ఎంఆర్ కళాశాలలో గురువారం జయభేరి సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 30 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఈ మేరకు జయభేరి సంస్థ సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్ నాగేంద్ర రెడ్డి, ప్రియదర్శిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేల్స్ , అకౌంట్ ఆడిట్ ఎగ్జిక్యూటివ్ లు, సిస్టం ఆపరేటర్ పోస్టులకు గతనాలుగేళ్లలో బికాం చదివి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఎంట్రీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఎంట్రీలో శ్రీకాకుళం విజయనగరం విశాఖపట్నం నుండి 146 మంది విద్యార్థులు హాజరు కాగా, 30 మందిని ఎంపిక చేశామని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు 14 వేల రూపాయల నుండి రూ.20వేలు వరకు జీతం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మహారాజ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు, విద్యార్థి విభాగం కన్వీనర్ బాబ్జి, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు కెప్టెన్ ఎ.కళ్యాణ్ అశోక్, డి.యామిని, ఎస్‌వి రమణ, ఎం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లతోనే పథకాలు పంపిణీ

ప్రజాశక్తి- వేపాడ

వాలంటీర్ల వ్యవస్థతోనే సంక్షేమ పథకాలు పంపిణీ సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మండలంలోని సింగరాయి సచివాలయం పరిధిలోని సోంపురం, ఆతవ గ్రామాల్లో పనిచేస్తున్న వాలంటీర్లకు గురువారం ఆయన పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివక్ష లేకుండా, లంచం, అవినీతికి తావులేకుండా, కులమత రాజకీయాలు పట్టించుకోకుండా వాలంటీర్ల ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం, ఉత్తమ సేవలందించి సేవారత్న, సేవామిత్ర అవార్డు పొందిన గ్రామ వాలంటీర్లకు సాలువాలతో సత్కరించి, సర్టిఫికేట్లు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పారావు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, సర్పంచ్ నిరుజోగి వెంకటరావు, అరిగిపాలెం మాజీ సర్పంచ్ దుల్ల వెంకటరమణ, నాయకులు దుల్ల సన్యాసిరావు, హరీష్, జెసిఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను, ఎంపిడిఒ పట్నాయక్, సచివాలయాల సిబ్బంది, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజల చెంతకు చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న వాలంటీర్లే సంక్షేమ సారధులని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణ రావు అన్నారు. గురువారం 1వ సచివాలయం (1,2) వార్డులలో నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధుల్లా పనిచేస్తున్న వాలంటీర్లు నిష్పక్షపాతంగా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించి జగన్మోహన్ రెడ్డికి వెన్నుదన్నుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ జేసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్స్ రమేష్ నాయుడు, రాములు, సచివాలయం కన్వీనర్లు, మున్సిపల్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల: గడప గడపకు అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు అన్నారు. గురువారం కొండ వెలగాడలో వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వాలంటీరు వంకర రేణుకకు సేవా వజ్ర పురస్కారం, జగన్నాదం నూకరాజుకు సేవారత్న, సేవా మిత్ర పురస్కారాలు అందుకున్న 19మంది వాలంటీర్లను జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, ఆర్‌టిసి జోనల్ చైర్మన్ గదల బంగారమ్మ సత్కరించారు. ఈ కార్యక్రమం ఇఒపిఆర్‌డి హెచ్. భానోజీరావు, వైసిపి నాయకులు మొయిద అక్కిజీ, పంచాయతి కార్యదర్శి వై. రమణ, వార్డు సభ్యులు, వైసిపి నాయకులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: వాలంటీర్‌కు సన్మానం చేస్తున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని

నగర పంచాయతిలో సేవావజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు పొందిన వాలంటీర్లకు గురువారం చైర్‌పర్సన్ సరోజిని ఆధ్వర్యంలో సత్కరించారు. అగురు వీధి, ఇందిరా కాలనీ, పద్మశాలి వీధి వార్డు సచివాలయంలో సత్కార కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించిన వార్డు వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర బిరుదులతో ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు, పట్టణ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబశివ రావు, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖలకు సంబంధించిన డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని బొడ్డవలస, జొన్నాడ సచివాలయం వాలంటీర్లను చింతలవలస సచివాలయంలో గురువారం ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు గ్రామానికి పట్టుకొమ్మలాంటి వారిని కొనియాడారు. ఇలాంటి వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టడం ప్రజలకు ఎంత ఉపయోగకరంగా ఉందన్నారు. వాలంటీర్లు ఇంకా గ్రామంలో చురుకైన పాత్ర వహించి ప్రజలకు సేవ చేసే గుణం అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, సర్పంచులు కోరాడ రమణి, కోటి నాయుడు, ఎర్ర శ్రీనివాసరావు పలువురు నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: వాలంటరీ వ్యవస్థతోనే రాష్ట్రంలో సంక్షేమం సాధ్యమైందని ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, జెడ్‌పిటిసి గార తవుడు అన్నారు. గురువారం మరుపల్లి గ్రామంలో వాలంటీర్లకు సేవా మిత్ర అవార్డులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందివ్వడంలో వాలంటీర్ల పాత్ర కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బెల్లాన త్రినాధరావు, లెంక రామలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, ఎంపిడిఒ పప్పు సుదర్శన్, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు అన్నారు. మండలంలో గురువారం రామలింగపురం, దేవాడ, ముసిరాం సచివాలయాల వాలంటీర్లకు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్లను సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలతో సత్కరించారు. నాయుడుబాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా వాలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోపమ్మ, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, సర్పంచులు, ఎంపిటిసిలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల సత్కారం బహిష్కరిస్తాం

నెల్లిమర్ల: వాలంటీర్ల సత్కారం బహిష్కరిస్తున్నట్లు నగర పంచాయతి పరిధి కొండపేటకు చెందిన 3వ వార్డు కౌన్సిలర్ మొయిద శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 3వ వార్డు పరిధిలో వార్డు వాలంటీర్లకు సత్కారం చేస్తున్నట్లు వార్డు ఎడ్మిన్ ఆహ్వానం పలికారని అయితే వార్డుతో సంబంధం లేకుండా ఇతర వార్డులకు చెందిన వాలంటీర్లను నియమించి వారికి సత్కారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమ వార్డు పరిధిలో నియమించిన వాలంటీర్లు బయట ఉద్యోగాలు చేసుకుంటూ ఒకటో తేదీన పింఛను పంపిణీ చేయడం తప్ప వార్డు సమస్యలు పట్టించుకోవడం లేదని తెలిపారు. దీనిపై పలుమార్లు అధికార్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా వార్డు కౌన్సిలర్‌గా ప్రజలు ఎన్నుకున్నా తమ వార్డుకు సంబంధం లేని వ్యక్తులను వార్డు వాలంటీర్లుగా నియామకం చేపట్టారని ఆరోపించారు. కాగా వార్డు వాలంటీర్ల సత్కారం తనతో బాటు 2వ వార్డు కౌన్సిలర్ పైల భారతి కూడా బహిష్కరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

సక్రమంగా విధులు నిర్వర్తించాలి



వృద్ధురాలికి పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

భోగాపురం: వాలంటీర్లు సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. గురువారం మండలంలోని రావాడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ ఫలాలు తీరు, గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సందేశంతో ఉన్న బుక్‌లెట్లను అందజేశారు. వాలంటీర్లతో మాట్లాడుతూ అప్పగించిన 50 ఇళ్లల్లో ఉన్న సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, వైస్ ఎంపిపి రావాడబాబు, సర్పంచ్ ఉపరబక్త పైడినాయుడు, హౌసింగ్, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్లు ఉప్పాడ శివారెడ్డి, మైలపల్లి నరసింహులు, వైసిపి నాయకులు పడాల బాను, పడాల శ్రీనివాసరావు, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సుందర హరీష్, రామ్మూర్తి, కర్రోతు శ్రీనివాసరావు, కర్రోతు వెంకటరమణ, పోతంరెడ్డి గోపి, సీతమ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేలకూలిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్

వేపాడ : మండలంలోని జాకేరు గ్రామంలో గురువారం కురిసిన వర్షానికి, భారీ గాలులకు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలింది. దీంతో గ్రామంలో విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. గ్రామ సర్పంచ్ బద్ద చిన్నమ్మలు, నాయకులు అప్పల నాయుడు చొరవతో విద్యుత్ సిబ్బంది హుటా హుటిన గ్రామానికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేసి విద్యుత్తు సౌకర్యం కల్పించారు.



నేలకూలిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్

రెండు రోజులుగా తొలగించని చెట్టుకొమ్మ

అధికారులు నిర్లక్ష్యమో... ప్రజా ప్రతినిధుల అసమర్థతో తెలీదు గానీ ఈదురు గాలులకు రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టుకొమ్మను రెండు రోజులుగా తొలగించక పోవడంతో ప్రజలు అసహనానికి గురవుతున్నారు. మండలంలోని బొద్దాం నాలుగు రోడ్ల కూడలి నుండి కొండగొంగుబూడి వెళ్లే ప్రధాన రహదారిలో ఎస్ కోట సీతారాంపురం జంక్షన్ వద్ద బుధవారం వీచిన ఈదురు గాలులకు మర్రిచెట్టు కొమ్మ రోడ్డుకు అడ్డంగా పడింది. ఆ చెట్టుకొమ్మను తొలగించకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాకపోకలకు అంతరాయం లేకుండా రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న మర్రి చెట్టు కొమ్మను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మహానాడుకు తరలి వెళ్లాలి

శృంగవరపుకోట: ఈనెల 27, 28 తేదీల్లో రాజమండ్రిలో జరిగే మహానాడు కార్యక్రమానికి గ్రామస్థాయి నుండి టిడిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లాలని టిడిపి నియోజకవర్గ యువనేత గొంప కృష్ణ కోరారు. బుధవారం మండలంలోని రాజపేట గ్రామంలో నిర్వహించిన చింతామణి పండుగలో ఆయన పాల్గొన్నారు. గ్రామదేవతను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆయన కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతూ నియోజకవర్గం నుండి ప్రతి మండలానికి ఐదు బస్సులు ఏర్పాటు చేశామని వాటి ద్వారా తరలి వెళ్లాలని కోరారు. రాజమండ్రిలో బస చేసేందుకు ఏర్పాటు చేశామని తిరిగి చక్కగా మీ గ్రామాలకు తీసుకొచ్చి దింపుతామని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ టిడిపి పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు దావాలరావు చంద్రశేఖర్, జామి మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు, నాయకులు ఇందుకూరి శ్రీను రాజు, గోపాలపల్లి వినాయక్, పల్లి సర్పంచులు అడారి మహేశ్వరరావు, గనివాడ సన్యాసినాయుడు, దేవరాయలు, లగుడు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చింతాలమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

మండలంలోని రాజపేట గ్రామంలోని గురువారం గ్రామ దేవత చింతాలమ్మ తల్లి జాతర సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోళ్ల లలితకుమారి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, మండల పార్టీ ప్రచార కార్యదర్శి, ఇందుకూరి శ్రీను రాజు, టిడిపి విశాఖ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాపుగంటి శ్రీనివాసరావు, నాయకులు చెక్కా కిరణ్ కుమార్, వాకడ బాల ఈశ్వర్ భరత్ పొట్నూరు అప్పలరాజు, యలమంచిలి అక్కునాయుడు, గొర్రపోటు రోహిణి కుమార్, సిమ్మిరెడ్డి కొండలరావు, మౌళి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాలంటీర్లకు సన్మానం

మెరక ముడిదాం: మండలంలోని ఇప్పలవలస, చిన బంటుపల్లి, చెల్లాపురం, భైరిపురం సచివాలయ పరిధిలో ఉన్న గ్రామ వాలంటీర్లకు శుక్రవారం సేవా మిత్ర పురస్కారాలు అందజేస్తున్నామని ఎంపిడిఒ పి. రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఎన్‌టిఆర్ సేవలు అమోఘం

బొబ్బిలి: సినీ, రాజకీయ రంగాలలో ఎన్‌టిఆర్ సేవలు అమోఘమని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన అన్నారు. ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలలో భాగంగా గురువారం కోటలో ఎన్‌టిఆర్ అభిమానులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ రంగంలో అడుగుపెట్టిన ఎన్‌టిఆర్ రాజకీయ రంగంలో బాగా రాణించారన్నారు. ముఖ్యమంత్రిగా పని చేసిన ఆయన పేదల సంక్షేమానికి కృషి చేశారని కొనియాడారు. పేదల గుండెల్లో ఎన్‌టిఆర్‌కు ఎప్పుడూ స్థానం ఉంటుందన్నారు. తాను కూడా ఎన్‌టిఆర్ అభిమానిని అని అన్నారు. ఎన్‌టిఆర్ అభిమానులతో పాటు మెగా, అక్కినేని అభిమానులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, ఎన్‌టిఆర్ అభిమానులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

'పతివాడ'ను మరిస్తే ఎన్‌టిఆర్‌ను మరిచినట్లే

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడును మరిచినట్లయితే ఎన్‌టిఆర్‌ను మరిచినట్లేనని నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగారు రాజు అన్నారు. గురువారం మండలంలోని చల్లవాని తోటలో పతివాడ స్వగృహం వద్ద నియోజకవర్గం టిడిపి సమావేశం జరిగింది. మాజీ మంత్రి పతివాడకు చెప్పకుండా నెల్లిమర్ల నియోజకవర్గం ఇంచార్జిగా కర్రోతు బంగారు రాజుని ప్రకటించడంపై పతివాడ కుటుంబీకులతో పాటు మాజీ ఎంపిపి మహంతి చిన్ననాయుడు కూడా పార్టీకి దూరంగా ఉన్నారు. సీనియర్లమైన తమతో మాట మాత్రం కూడా చెప్పకుండా ఇంఛార్జిని ప్రకటించడం ఏంటని ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఇటీవల పతివాడ కుటుంబంతో పాటు మాజీ ఎంపిపి మహంతి చిన్నంనాయుడు కలిసి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో గురువారం నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతివాడ కుమారుడు తమ్మి నాయుడు మాట్లాడుతూ పార్టీకి కట్టుబడి ఉంటామని, తమతో మాట మాత్రం చెప్పకుండా ఇంచార్జిని ప్రకటించడంపై కొంత అసహనానికి గురయ్యామని చెప్పారు. అనంతరం బంగారాజు మాట్లాడుతూ మాజీ మంత్రి పతివాడను మరువద్దని మా నాన్న 1985 సంవత్సరంలోనే మాకు చెప్పాడని అన్నారు. వారి అడుగుజాడల్లోనే, వారు సూచనలు మేరకే పార్టీని ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తానని అన్నారు. తమపై పోటీ చేస్తున్న ప్రతిపక్ష నాయకుడు గజకర్ణ, గోకర్ణ అన్నారు. ఒకరిపై ఒకరికి ఛాడీలు చెప్పి పార్టీ నుంచి తన వైపు లాక్కునే ప్రయత్నం చేసేందుకు చూస్తున్నాడని అన్నారు. కార్యకర్తలంతా సమిష్టిగా ఉంటే విజయం తనంతట తానే వస్తుందని కార్యకర్తలకు తెలిపాడు. అనంతరం బంగారు రాజుని, మాజీ మంత్రి పతివాడ, నాయకులు కార్యకర్తలు సన్మానించారు. ఈ సమావేవంలో టిడిపి పూసపాటిరేగ, నెల్లిమర్ల మండల అధ్యక్షులు మహంతి శంకర్రావు, కడగల ఆనంద్‌కుమార్, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, నాయకులు సువ్వాడ రవిశేఖర్, మాజీ జెడ్‌పిటిసి ఆకుల అప్పలనారాయణ, ఆకిరి ప్రసాదరావు, గేదెల రాజారావు, పతివాడ అప్పలనాయుడు, కర్రోతు సత్యనారాయణ, పల్లి భాస్కరరావు, నాలుగు మండలాల సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు

వ్యవసాయ సహాయకులకు శిక్షణ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని దెందేరు ఆర్‌బికె వద్ద గురువారం కొత్తవలస, వేపాడ, ఎల్‌కోట పరిధిలో ఉన్న ఉద్యాన, వ్యవసాయ సహాయకులకు డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యాన శాఖ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ శాఖ సహాయ సంచాలకులు శైలజ రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం అమలులో ఉన్న పథకాలు వాటి అమలు, సబ్సిడీ వంటి వివిధ అంశాల మీద అవగాహన కల్పించారు. ఉద్యాన అధికారిని ఉమ భరణి మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి కాయ కోత పూర్తి అయ్యిందని, జూన్, జూలై నెలలో చేపట్టవలసిన కొమ్మ కత్తిరింపులు, ఎరువుల వినియోగం వంటి కార్యక్రమాలు రైతులకి చెప్పి చేయించాలని తెలిపారు. ఎపిఎంఐపి పీడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కొత్తవలస మండలంలో వర్షాధారం పై ఆధారపడి పంటలు పండించే రైతులకు మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా అందుతున్న బిందు, తుంపర సేద్యం పట్ల రైతులకి అవగాహన కల్పించి రైతుకి ఆదాయం ఎక్కువగా వచ్చే విధంగా మీరంతా పని చేయాలని సూచించారు. బిందు, తుంపర సేద్యం అవసరం ఉన్న రైతులని వరి విత్తనాలు రిజిస్ట్రేషన్ చేసిన సమయంలో గుర్తించి రైతులకు మైక్రో ఇరిగేషన్ ఉపయోగాలు తెలియచేసి రైతులు అందరూ తప్పకుండా లబ్ది పొందేల చేయాలని ఆయన తెలిపారు. కొత్తవలస వ్యవసాయ సంచాలకులు విజయ మాట్లాడుతూ శుక్రవారం నుంచి రైతులకు కావల్సిన వరి విత్తనాలు రిజిస్ట్రేషన్ మొదలు పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస వ్యవసాయ అధికారిని మాధురి శరణ్య, మూడు మండలాల ఉద్యాన, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిఎంఐపి పీడీ లక్ష్మీనారాయణ

క్వారీ పేలుళ్లతో భయం... భయం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని రామస్వామిపేట గ్రామ సమీపంలో గల నర్సిపల్లి మెట్ట క్వారీ నుండి పెద్దపెద్ద శబ్దాలతో వేల పాల లేకుండా క్వారీ పేలుళ్లు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. కొన్ని క్వారీలు ప్రభుత్వం నుండి అనుమతులు పొందినవి కాగా మరికొన్ని క్వారీలకు ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులూ లేవు. ఇష్టానుసారంగా పేలుళ్లతో రాళ్లను కదలించడం వల్ల ఆ శబ్దాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరహా అక్రమాలకు పాల్పడిన వారికి రాజకీయ అండదండలు ఉండటంతో రెవెన్యూ, గనులశాఖ అధికారులు కనెత్తి చూసిన పాపాన పోలేదు. రాత్రింబవళ్లు తేడా లేకుండా క్వారీ పేలుళ్లు నిర్వహించడంతో తద్వార వచ్చిన కాలుష్యం కారణంగా పంట పొలాలు, తాగునీరు కలిషితవుతున్నాయి. ఈమేరకు రామస్వామిపేట, సోంపురం పంచాయితీ వాసులు రోగాల బారిన పడి ఇప్పడికే అనేక మంది మృతి చెందారు. క్వారీ పేలుళ్ల పరిసర ప్రాంతాలలో ఉంటున్న పశువులు, మేకలు, గొర్రెల కాపర్లకు దినదిన గండంగా మారింది. పేలుళ్ల సమయంలో వచ్చిన దుమ్ము, దూలి కారణంగా జీడి, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ తరహా అక్రమ దారులపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



క్వారీ పేలుళ్ల వల్ల బయటకు వస్తున్న కాలుష్యం

ఎండలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కొత్తవలస

వడదెబ్బ తగలకుండా వేసవి ఎండలపై అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అన్నారు. వియ్యంపేట పంచాయతీ, కోటానివానీ పాలెం ఉపాధిహామీ వేతన దారులతో గురువారం ఆమె సమావేశమయ్యారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున పనిచేసే చోట జాగ్రత్తలు పాటించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ఓరస్, గ్లోకోజ్ పాకెట్స్ పంపిణీ చేశారు. వేసవిలో డీహైడ్రేషన్‌కి గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ సత్యారావు వడదెబ్బపై అవగాహనా కల్పించారు. జ్వరం, వాంతులు, కళ్ళు తిరగడం, విరోచనాలు అవడం, బీపీ డౌన్ అయ్యి ఒళ్ళు చల్ల బడటం వంటి లక్షణాలు కనబడితే వెంటనే నీడ ప్రదేశానికి తీసుకు వెళ్లి బట్టలు వదులు చేసి గాలి తగిలేటట్లు చేసి మజ్జిగ గాని గంజి గాని, నిమ్మరసం గాని, గ్లూకోజ్ గాని తాగించాలని తెలిపారు. బీపీ, షుగర్, హార్ట్ కంప్లయింట్ ఉంటే రెగ్యులర్ మందులు వేసుకోవాలని తెలిపారు. పనిలో చుట్ట, భీడి, ఖైనీ, మందు తాగరాదని తెలిపారు. ఎండలోకి వెళ్ళినపుడు తలకి టోపీ, కాళ్ళకీ చెప్పులు కళ్ళకి కళ్లద్దాలు పెట్టుకోవాలన్నారు. గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఒ విజయలక్ష్మి, టెక్నాలజి అసిస్టెంట్ ఇందుమతి, ఫీల్డ్ అసిస్టెంట్ నూకరాజు, ఎంపిఒహెచ్ఒ నూకరాజు, హెల్త్ సూపరవైజర్ రాము, ఏఎన్ఎమ్ భవాని, ఆశ వర్కర్ వరలక్ష్మి, మేట్లు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి గోపమ్మ



ప్రచార పత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

బొబ్బిలి: మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు కోరారు. పాదయాత్ర, ఎన్నికల హామీలు అమలు చేసి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈ నెల 31 నుంచి జూన్ 9వరకు జరగనున్న రాష్ట్ర ప్రచార జాతాను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం బొబ్బిలిలో ప్రచార పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని సిఎం జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రచార జాతా జూన్ ఒకటిన ఉదయం 8గంటలకు బొబ్బిలి వస్తుందని, జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, మున్సిపల్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే లేగ దూడల సంతానం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే లేగ దూడల సంతాన ఉత్పత్తి పెరుగుతుందని జిల్లా పశు జనాభివృద్ధి సంఘం కార్యనిర్వాహణాధికారి డాక్టర్ దామోదర్ అన్నారు. మండలంలోని సీతారాంపురం గ్రామంలో గురువారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ప్రదర్శనలో 62 లేగ దూడలు పాల్గొనగా ఎంపికైన మూడు ఉత్తమ లేగ దూడలకు బహుమతులు అందజేశారు. ఎస్‌కోట అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి చలపతిరావు మాట్లాడుతూ లేగ దూడలకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. జున్నుపాలు పశువు ఈనిన అరగంటలో దూడకు తాగించాలని, మట్టి నాకకుండా మూతి బుట్ట కట్టాలని, తెలియజేశారు. ప్రదర్శనలో పాల్గొన్న లేగ దూడ లన్నింటికీ కాల్షియం టానిక్ పట్టించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ జి హేమ, పశు వైద్యులు డాక్టర్ జగదీష్, గ్రామ సర్పంచ్ రామకృష్ణ, పశుసంవర్ధక అసిస్టెంట్లు, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న లేగదూడలు

రైతు భరోసా కేంద్రాలకు చేరిన పశుగ్రాస విత్తనాలు

పశుగ్రాస విత్తనాలు రైతు భరోసా కేంద్రాలకు చేరాయని మండల పశువైద్యాధికారి డాక్టర్ జి. హేమ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ పశుగ్రాస విత్తనాలు మండలానికి ఒక టన్ను వచ్చాయన్నారు. 5 కేజీల కిట్టు 75శాతం రాయితీపై రైతుకి రూ.115కు ఇస్తామన్నారు. ప్రతి ఆర్‌బికేలో ఈ పశు గ్రాస విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఐదు కేజీల పశుగ్రాస విత నాలు కిట్టు 25 సెంట్లుకి సరిపోతుందని విత్తనాలు కావలసినవారు ఆధార్ కార్డు తీసుకువెళ్లి రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలని ఆమె కోరారు.

మోస్తరు వర్షం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణ, పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ప్రజలు సేద తీరారు. మోస్తరు వర్షంతో గాంధీబొమ్మ రోడ్డు, రాజా కళాశాల రహదారిపై వరదనీరు పొంగిపొర్లింది. రోడ్లపై వరదనీరు ప్రవహించడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలు తీవ్రంగా ఉండడంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవ్వగా సాయంత్రం వర్షం కురవడంతో సేద తీరారు.




గాంధీ బొమ్మ రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

ఖరీఫ్ సీజన్‌కు ముందస్తు ప్రణాళిక

ప్రజాశక్తి- మెరకముడిదాం

ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ముందస్తు ప్రణాళికను సిద్ధం చేశామని మండల వ్యవసాయాధికారి శ్రావణి తేజ తెలిపారు. గురువారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. మండలంలో ఉన్న 18రైతు భరోసా కేంద్రాలు ద్వారా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశాం. మొత్తం 8,450 ఎకరాల్లో ఈ ఏడాది వరి సాగుకు సన్నద్ధ మవుతున్నారు. ఈ సాగుకు 1843 క్వింటాల వరి విత్తనాలు అవసరం. దీనికి సంబంధించిన ప్రణాళికను, అవసరాలను ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనల రూపంలో పంపించాం. పచ్చి రొట్ట విత్తనాలైన జీలుగా, కట్టి జనము, పిల్లి పెసర వంటి విత్తనాలును ఏభై శాతం రాయితీతో 18 రైతు భరోసా కేంద్రాల్లో ప్రీ పోసిషన్ చేశాం. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల రాకపైనా దృష్టి సారించాం. యూరియా 684 ఎంటిఎస్, డిఎపి 432 ఎంటిఎస్, ఎంఒపి 216 ఎంటిఎస్ ఎరువులు అవసరమవుతాయని అవచనా వేశాం. రైతు భరోసా కేంద్రాల్లో ఇప్పటికే యూరియా 252 ఎంటిఎస్, డిఎపి 90 ఎంటిఎస్ ఎరువులను అందుబాటులో ఉంచాం. ఖరీఫ్ సీజన్‌కు రైతులకు వ్యవసాయ పరంగా ఏవిధమైన ఆటంకం కలగకుండా ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామని ఎఒ శ్రావణి తేజ తెలిపారు.



శ్రావణి తేజ

పనుల పరిశీలన

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని సొంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రెండో విడత నాడు - నేడు పనులను స్థానిక ఎంపిడిఒ బియస్‌కెఎన్ పట్నాయక్ గురువారం పరిశీలించారు. పనులను నాణ్యత లోపం లేకుండా చేయాలని సూచించారు. పాఠశాల పునప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. ఈ పరిశీలనలో మండల పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఆలీ, సిఆర్పి రాంప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ప్రజాశక్తి -భోగాపురం

మామిడికాయలు దించేందుకు వెళ్లిన ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మండలంలోని జాతీయ రహదారి సమీపంలోని అక్కివరం జంక్షన్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. డెంకాడ మండలం చిన్న అక్కివరం గ్రామానికి చెందిన పెంటుబోయిన ఆదినారాయణ కూలి పనులతో పాటు పశువులను కాస్తుంటాడు. తోట కాపాలదారు సత్యంతో స్నేహం ఏర్పడింది. దీంతో తరచూ ఆ తోటకి వెళ్తుంటాడు. ఎప్పటిలాగానే మామిడికాయలు దించేందుకు బుధవారం బయలుదేరాడు. మధ్యాహ్నం సమయంలో అతని మృత దేహాన్ని తోట గుమస్తాగా పనిచేస్తున్న జగదీష్ తోటలో గుర్తించాడు. పోలీస్, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. చెట్టుపై నుండి జారిపడి మృతి చెందినట్లు భావిస్తున్నారు. అయితే భార్య, కుమారుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని కుమారుడు వాలంటీరుగా పనిచేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయితో వ్యక్తి అరెస్టు

విజయనగరం టౌన్ : విజయనగరం ఆర్అండ్‌బి జంక్షన్ వద్ద గంజాయి అక్రమంగా కలిగిన బొంతు వెంకటరావును వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లుగా సిఐ బి.వెంకటరావు తెలిపారు. గోకపేటకు చెందిన వెంకటేశ్వర రావు(37)ను అరెస్టు చేసి అతని నుంచి 5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ రైడ్‌లో వన్‌టౌన్ ఎస్ఐలు భాస్కర రావు, రామ గణేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

14 రోజులు రిమాండ్

లక్కవరపుకోట: మండలంలోని కల్లేపల్లి గ్రామానికి చెందిన వెలుగు బుక్ కీపర్ (విఒఎ) గోకాడ మహేశ్వరుని అదే గ్రామానికి చెందిన మరో విఒఎ గాడి చిన్నతల్లి, ఆమె ప్రియుడు డెంకాడ వాసి హత్య చేసిన సంఘటన పాఠకులకు విధితమే. హత్యకు పాల్పడిన వారితో పాటు పోలీసుల నుండి తప్పించుకునేందుకు సహకరించిన చిన్నతల్లి మరో ప్రియుడు కోరాడ సాయికుమార్‌లను అరెస్టు చేసిన పోలీసులు ఎస్‌కోట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం రాత్రి హాజరు పరిచారు. హత్యా నేరానికి పాల్పడిన వారు ముగ్గురికి మేజిస్ట్రేట్ సబ్బవరపు వాణి 14 రోజులు రిమాండ్ విధించడంతో ముద్దాయిలను విశాఖ కేంద్ర కారాగారానికి తరలించినట్లు స్థానిక ఎస్ఐ ఎం ముకుందరావు గురువారం తెలిపారు.